ప్రజాశక్తి

శుక్రవారం 28 మార్చి 2025

ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల వివరాలు

ఎంపిపి ఎన్నిక

మండలం	గెలిచిన అభ్యర్థి	మద్దతు పార్టీ
రామగిరి	వాయిదా	...
గాండ్లపెంట	వాయిదా	...
రొద్దం	నాగమ్మ	వైసిపి
కణేకల్లు	హెచ్.వండ్రయ్య	వైసిపి
కంబదూరు	లక్ష్మిదేవి	వైసిపి

వైస్ ఎంపిపి ఎన్నిక

మండలం	గెలిచిన అభ్యర్థి	మద్దతు పార్టీ
ఉరవకొండ-2	ఈడిగ ప్రసాద్	వైసిపి
యల్లనూరు	పి.రమాదేవి	వైసిపి
పెద్దపప్పూరు	ఎం.నాగవేణి	వైసిపి
రాయదుర్గం	అరుణ్‌కుమార్	వైసిపి

విద్యుత్ భారాలు తగ్గించాలి : ఏపి రైతుసంఘం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విద్యుత్‌భారాలను తగ్గించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని యువగలం పాదయాత్రలో నారా లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మీటర్లు బిగిస్తోందని ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై వేలకోట్ల రూపాయల విద్యుత్ భారాలు మోపుతున్నారన్నారు. జిల్లాలో పలు మండలాల్లో అకాల వర్షాలకు మామిడి, అరటి పంటలు వేలాది ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టు రైతుల ప్రోత్సాహకాలు రూ. 72 కోట్లు జిల్లాకు రావాలన్నారు. జిల్లాలో కారు చౌకగా 32 వేల ఎకరాలు ఆదానికి అప్పనంగా సోలార్ పరిశ్రమ పేరుతో ప్రభుత్వం అందించడానికి పూనుకుందన్నారు. భూములు కోల్పోయే రైతులకు న్యాయపరమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలిగించే 404, 405 జీవోలను రద్దు చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలని లైనింగ్ పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్తులో రైతు ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

జాతీయ స్థాయి జూడో పోటీలకు ధర్మవరం విద్యార్థిని

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

జాతీయ స్థాయి జూడో పోటీలకు ధర్మవరం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామ ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న లాస్య రెడ్డి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం తిమ్మారెడ్డి, పీడీ ప్రతాపరెడ్డి తెలిపారు. ఈనెల 15 నుండి 17వ తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ జూడో పోటీల్లో లాస్య రెడ్డి అనే విద్యార్థిని 48 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. ఈ విద్యార్థిని జాతీయ పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ఈనెల 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఉత్తరాఖండ్ లో జరిగే జూనియర్ జాతీయ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున లాస్యరెడ్డి పాల్గొంటుందని వివరించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్‌తో పాటు పీడీ, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, పాఠశాల విద్యార్థులు లాస్య రెడ్డిని అభినందించారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి బుక్కపట్నం

మేజర్ పంచాయతీ పరిధిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడడమే తమ లక్ష్యమని మేజర్ పంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు తెలిపారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈసందర్భంగా దాదాపు 8 పోల్స్ మేర త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించి నూతన బోరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాదిక్ భాషా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంత ప్రశాంతం.. సత్యసాయి ఉద్రిక్తం..!

- ◆ రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక వాయిదా
- ◆ పెనుకొండలో రామగిరి ఎంపిపి ఎన్నిక రచ్చ
- ◆ సజావుగా కణేకల్లు, కంబదూరు, రొద్దం ఎన్నిక
- ◆ వైస్ ఎంపిపి, ఉపసర్పంచి ఎన్నికలు ఏకగ్రీవం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ప్రజాశక్తి జిల్లా యంత్రాంగం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఉప ఎన్నికలు గురువారం జరిగాయి. ఐదు ఎంపిపి, నాలుగు వైస్‌ఎంపిపి స్థానాలకు సంబంధించి ఎన్నికలను ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక వాయిదా పడింది. ఇవి మినహా అనంతపురం జిల్లాలో కణేకల్లు, కంబదూరు శ్రీసత్యసాయి జిల్లా రొద్దం ఎంపిపి ఎన్నికలు సజావుగా జరిగాయి. వైస్ ఎంపిపిలకు సంబంధించి అనంతపురం జిల్లా ఉరవకొండ-2, యల్లనూరు, పెద్దపప్పూరు, రాయదుర్గంలో నిర్వహించిన ఎన్నికలో వైసిపి మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపిపి ఎన్నిక ప్రక్రియను పరిశీలిస్తే అనంతపురం జిల్లాలో సజావుగా జరుగగా, సత్యసాయి జిల్లాలో ఉద్రిక్తతల నడుమ నడిచాయి.

కంబదూరు ఎంపిపి లక్ష్మిదేవి

కణేకల్లు ఎంపిపి వండ్రయ్య

రొద్దం ఎంపిపి నాగమ్మ

రామగిరి, గాండ్లపెంటల్లో ఉద్రిక్తత

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి, గాండ్లపెంట ఎన్నికలు వాయిదా పడ్డాయి. రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక బుధవారమే జరగాల్సి ఉంది. అధికార టిడిపి, వైసిపి నేతల మధ్య ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. అధికార టిడిపికి పూర్తి బలం లేకున్నా ఎంపిటిసిలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో విప్ జారీ చేసేందుకు వెళ్లిన ఇద్దరిపై దాడులు సైతం జరిగాయి. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు తమకు రక్షన కల్పించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆశ్రయం కల్పించాలని ఆదేశాలిచ్చిన నేపథ్యంలో 144 సెక్షన్ విధించారు. రామగిరిలో పెద్దఎత్తున టిడిపి శ్రేణులు గుమికూడి ఉన్నారన్న ఉద్దేశ్యంతో వైసిపి ఎంపిటిసి అభ్యర్థులు ఎన్నికకు వెళ్లలేదు. కోరం లేకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేశారు. తమ పార్టీకి చెందిన ఎంపిటిసిలకు రక్షణ కల్పించాలని కోరుతూ వైసిపి నాయకులు పెనుకొండలో నిరసనకు దిగారు. పోలీసు రక్షణ నడుమ రామగిరికి తీసుకెళ్లాలని కోరుతూ సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషచరణ్ శ్రీ, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ తదితరులు పెనుకొండ పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. నిరసన సమయంలో టిడిపి శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో పెద్దఎత్తున ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గాండ్లపెంటలో వైసిపికి పూర్తిబలమున్నప్పటికీ తమవైపు వారిని తిప్పుకునేందుకు అధికార టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషచరణ్ శ్రీ ఆరోపించారు. అందుకే ఎన్నికను వాయిదా వేయించారని ఆరోపించారు. ఈ ఎన్నిక కూడా వాయిదా పడింది.

ఎంపిపిలుగా వైసిపి మద్దతుదారులు

కంబదూరు, కణేకల్లు, రొద్దం మండలాలకు జరిగిన ఎంపిపి ఎన్నికల్లో వైసిపి మద్దతుదారులు ఎన్నికయ్యారు. **కంబదూరు** ఎంపిపి ఎన్నికను మండల పరిషత్ భవనంలో గురువారం నిర్వహించారు. వైసిపికి చెందిన రాళ్ల అనంతపురం ఎంపిటిసి లక్ష్మిదేవమ్మను సభ్యులు ఏగ్రీవంగా ఎన్నిక చేశారు. ఎన్నిక అనంతరం కళ్యాణదుర్గం వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ మండలంలో వైసిపి శ్రేణులు సాధించిన సమిష్టి విజయం అన్నారు. **కణేకల్లు** ఎంపిపిగా వైసిపి మద్దతుదారుడు గరుడచేడు హరిజన వండ్రయ్య ఎన్నికయ్యారు. ఎంపిపిగా వండ్రయ్య ఒక్కరే పోటీలో నిలవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు. **రొద్దం** మండల ఎంపిపిగా వైసిపి మద్దతుదారురాలు నాగమ్మ ఏగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లూరు ఎంపీటీసీ నాగమ్మను ఎంపిపిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైస్ ఎంపిపిల ఎన్నిక ప్రశాంతం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు స్థానాలకు జరిగిన వైస్ ఎంపిపి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. **ఉరవకొండ** మండల పరిషత్ వైస్ ఎంపీపీగా పట్టణానికి చెందిన పదో ప్రాదేశిక సభ్యుడు ఈడిగ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ సభా భవనంలో వైస్ ఎంపీపీ కోసం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కుష్బు కొఠారి వ్యవహరించారు. ఈడిగ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి ధ్రువపత్రాన్ని అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. **పెద్దపప్పూరు** మండల వైస్ ఎంపీపీ-2గా పసులూరు ఎంపీటీసీ వరదమ్మ గారి నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈమె ఎన్నిక అనంతరం ఎన్నికల అధికారి ప్రభాకర్ రెడ్డి, ప్రిసైడింగ్ ఆఫీసర్, ఎంపీడీవో శకుంతలమ్మలు ఎన్నిక ధ్రువపత్రాన్ని అందజేశారు. **రాయదుర్గం** మండల ఉపాధ్యక్షుడి ఎన్నికను డిఆర్వో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో కొండన్న, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు. సమావేశానికి పది మంది వైసిపి ఎంపిటిసిలు హాజరయ్యారు. వైస్ ఎంపీపీగా అరుణ్ కుమార్‌ను జుంజురంపల్లి ఎంపీటీసీ సురేష్ ప్రతిపాదించగా బిఎన్.హళ్లి ఎంపీటీసీ లక్ష్మి బలపరిచారు. పోటీ లేకపోవడంతో అరుణ్ కుమార్‌ను వైస్ ఎంపీపీగా ప్రకటిస్తూ ఎన్నికల అధికారి డిక్లరేషన్ అందజేశారు. **యల్లనూరు** మండలం వైస్ ఎంపిపిగా తిమ్మంపల్లి ఎంపిటిసి పి.రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. మండలంలో 10మంది ఎంపిటిసిలు స్థానాలు ఉండగా వైస్ ఎంపిపి ఎన్నికకు 7 మంది హాజరయ్యారు. ఏడుగురూ పి.రమాదేవిని వైస్ ఎంపిపిగా బలపరిచడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి రఘునాథ్ రెడ్డి ఆమెకు డిక్లరేషన్ అందజేశారు.

ఉపసర్పంచిల ఎన్నిక ఏకగ్రీవం..!

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరిగిన నాలుగు ఉపసర్పంచి ఎన్నికలూ ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో **పామిడి** మండల పరిధిలోని రామగిరి ఉపసర్పంచికు నిర్వహించిన ఎన్నికలో టిడిపి మద్దతుతో బోయ లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **వజ్రకరూరు** మండలం కొనకొండ్ల ఉపసర్పంచి స్థానానికి చిన్నలింగప్పగారి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. **మడకశిర** మండలం కళుమర్రి వైస్ సర్పంచిగా టిడిపి మద్దతుదారుడు కెపి.నరసన్న ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. **పెనుకొండ** మండలం రాంపురం ఉపసర్పంచిగా టిడిపి మద్దతుదారుడు నాగప్ప ఏగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

పెనుకొండలో రామగిరి రచ్చ

◆ ఎంపిటిసిల కోసం టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ ◆ పెనుకొండలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి ఎంపిపి ఎన్నిక పెనుకొండలో రచ్చలేపింది. తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఉద్రిక్తతలకు దారితీసింది. రామగిరి ఎంపిపి ఎన్నికను అధికారులు గురువారం నాడు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 6 మంది ఎంపీటీసీలను కిడ్నాప్ చేశారంటూ రామగిరి పోలీస్ స్టేషన్లో వారి కుటుంబ సభ్యులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో ఎంపీటీసీలను ఎవరూ కిడ్నాప్ చేయలేదని తమ వద్ద ఉన్నారని పేర్కొని వైసిపి నాయకులు పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ వద్ద గురువారం ఉదయం హాజరుపరిచారు. ఇదే సమయంలో రామగిరి టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టిడిపి, వైసిపి శ్రేణులు కార్యాలయంలోకి రావడంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ఏర్పాట్లు చేశారు.



ఎంపిడిఒ కార్యాలయంలోకి వెళ్తున్న ప్రకాష్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

టిడిపి వెంట ఒక ఎంపిటిసి

ఎంపిటిసిలను తమతో తీసుకెళ్లేందుకు తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి నాయకుల బుజ్జగింపుల పర్వం చాలా సేపు కొనసాగింది. 6 మంది ఎంపీటీసీలలో ఐదు మంది మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెంట వెళ్లారు. ఒక ఎంపీటీసీ మాత్రం తెలుగుదేశం పార్టీ నాయకుల వెంట వారి వాహనాల్లో వెళ్లారు.

ఎంపీటీసీలను బుజ్జగించిన టిడిపి నాయకులు

పెనుకొండ తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా రామగిరి ఎంపీటీసీలు 6 మందిని ఆ మండలం తెలుగుదేశం నాయకులు చాలాసేపు బుజ్జగించారు. తమతో రావాలంటూ వారిని కోరారు. ఇదే సమయంలో ఆరు మందిలో ఎవరూ వారి వెంట వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. తమ పార్టీ ఎంపిటిసిలను టిడిపి నాయకులు బలవంత పెడుతున్నారని ఆరోపిస్తూ కార్యాలయం బయట ఉన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అతని అనుచరులు తలుపులుతోసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు బలవంతంగా వారిని అడ్డుకున్నారు. ఓ వైపు పోలీసులు పరిస్థితిని చక్కదిద్దుతున్నా తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు.

పెనుకొండ పోలీసు స్టేషన్ వద్ద వైసిపి నాయకుల నిరసన

పోలీసులపై వైసిపి నాయకుల ఆగ్రహం

తమ ఎంపిటిసిలను బలవంతంగా తెలుగుదేశం నాయకులు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. పోలీసులే తెలుగుదేశం నాయకులు సహకరించి వారికి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. తహశీల్దార్ కార్యాలయంలోకి తమను ఎందుకు పంపరంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో వైసిపి నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు తెలుగుదేశం కండువాలు వేసుకున్నారంటూ ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు దగ్గరుండి తెలుగుదేశం నాయకులకు సహకరిస్తున్నారని ఆరోపించారు.

పెనుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షులుగా జి.మదన్ మోహన్ రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది బి.అబూబకర్, సి.నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు పెనుకొండ బార్ అసోసియేషన్ కు 2025-26 సంవత్సరానికి గాను జారీ చేసిన ఎన్నికల షెడ్యూల్ మేరకు ఈనెల 10వ తేదీన ఎన్నికల అధికారులుగా తమను నియమించారన్నారు. తమకు సహాయకులుగా బి.వినోద్ నాయక్ ను నియమించారనితెలిపారు. ఎన్నికల షెడ్యూల్ మేరకు ఈ నెల 17వ తేదీన నామినేషన్లు స్వీకరించడం జరిగిందని నామినేషన్ ప్రక్రియలో భాగంగా అధ్యక్షులు స్థానానికి న్యాయవాది జి.మదన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి. మోహన్ నాయక్, సెక్రటరీగా బి. కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరిగా బి.శ్రీరాములు, అదనపు జాయింట్ సెక్రటరిగా ఎస్. విశ్వనాధ్ నాయక్, కోశాధికారిగా డి. రాజేష్ నాయక్, లైబ్రరీ సెక్రటరిగా అబ్దుల్ ముజీబ్ ఖాన్ పఠాన్,కార్యనిర్వాహక సభ్యులుగా సి.ఆర్. నాగార్జున,జి.దయానంద రెడ్డి, ఎం.నాగేశ్వరి, వి.ధర్మేంద్ర రెడ్డి, కే.హరీష్, మహమ్మద్ అబ్దుల్ రఫీ నామినేషన్ వేశారన్నారు. అధ్యక్ష స్థానంతో పాటు అన్ని స్థానాలకు ఇతరులు ఎవరు నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీ అధ్యక్షులు జి. మదన్ మోహన్ రెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు.

బార్ అసోసియేషన్ సభ్యులు

భూకబ్జాపై జాతీయ గిరిజన శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లి గిరిజనుల భూకబ్జాపై ఢిల్లీలోని జాతీయ గిరిజన శాఖ కమిషన్ చైర్మన్ హుస్సేన్ నాయక్‌కు బంజారా సంక్షేమ సేవా సంఘం నాయకులు విన్నవించుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం గిరిజన జాతీయ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి వారు ఫోన్ లో మాట్లాడుతూ దొరిగిల్లు గ్రామ పొలంలో 50 మంది అడవి బ్రాహ్మణపల్లి గిరిజనులు ఎన్నో ఏళ్లుగా 150 ఎకరాలు సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే అమాయకులైన గిరిజనులను మోసగించి ముదిగుబ్బ మండల పరిషత్ అధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్ తన కుటుంబ సభ్యులు, తన బంధువుల పేరిట 1 బి లో ఎక్కించి పట్టాదారు పాసుపుస్తకాలు పొంది బ్యాంకులో రుణాలు కూడా తీసుకున్నారన్నారు. సాగులో ఉన్న గిరిజన రైతులను కాదని రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా ఎంపీపీ బంధువులకు ఆ భూములు కట్టబెట్టారన్నారు. ఈ విషయం ఆర్డీవో, కలెక్టర్, ఎస్పీ, ముఖ్యమంత్రి తో పాటు మంత్రి లోకేష్ కు రెవిన్యూ మంత్రికి తెలిపినా ఎవరు స్పందించలేదన్నారు. చివరికి జాతీయ గిరిజన కమిషన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరమన్నారు. ఎంపీపీ తో పాటు ఆయన అనుచరులు గిరిజనులను బెదిరిస్తూ ఈ విషయం బయట చెబితే చంపుతామని వాహనాలలో మారణాయుధాలతో తిరుగుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించి గిరిజనుల పేరిట పట్టాలు ఇవ్వాలని కోరామన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో రవీంద్ర నాయక్, నరేష్ నాయక్, బాబు నాయక్ ఉన్నారు.



కమిషన్ ఛైర్మన్‌కు వినతిని అందజేస్తున్న నాయకులు

తీరు మార్చుకోని వైద్య సిబ్బంది

రోగులపై వీడని నిర్లక్ష్యం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది తమ తీరు మార్చుకోలేదు. రోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన పాలగిరి వహీదా అను మహిళ విరేచనాలతో బాధపడుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తన భర్తతో ఉదయం 8 గంటలకు వచ్చింది. అక్కడ విధులలో ఉన్న ఏఎన్ఎం 'నాది రాత్రి డ్యూటీ మాత్రమే, వచ్చే వారితో చూపించుకో' అని చెప్పి వెళ్ళిపోయింది. ఆమె అలాగే భాదను భరిస్తూ మరో ఎఎన్ఎం వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ముందు రోజైన బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఫైరోజా బేగం ఇదే ఆసుపత్రిని తనిఖీ చేసి నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందికి చివాట్లు పెట్టింది. అయినా ఇరవై నాలుగు గంటలు కూడా గడవక మునుపే ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడంతో రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాలనే బేఖాతరు చేస్తే వైద్య సిబ్బందిని గాడిలో పెట్టే నాథుడు ఎవరని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గురుకులం ప్రవేశానికి దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతుల్లో ఉన్న ఖాళీ సీట్లు భర్తీకి ఏప్రిల్ 9 వరకు దరఖాస్తు గడువు పొడగించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో ఐదవ తరగతిలో 80, ఎస్టీ బ్యాక్ లాగ్ క్రింద 6వ తరగతిలో 15 సీట్లు, 7వ తరగతిలో 1 సీటు, 8వ తరగతిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ సీట్లు భర్తీ లో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓబీసీలకు 2 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20 తనకల్లు మండలం సిజి ప్రాజెక్టు సమీపంలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో రాతి పరీక్షలు నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9493360127కు ఫోన్‌చేసి సంప్రదించ వచ్చన్నారు.

నవోదయం 2.0ను ప్రతిష్టాత్మకంగా అమలుచేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

నవోదయం 2.0 ను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు ఆయన అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌తో కలసి కదిరి ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేవారు. స్టేషన్ పరిధిలో నమోదైన నేరాలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని అమలు చేసి కదిరి స్టేషన్ పరిధిలో నాటు సారాయి నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీధర్, ఎస్ఐ దత్తాత్రేయ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - నల్లచెరువు

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గుర్తింపు విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రతి ఒక్క రైతు ఈ నెలాఖరు లోపు తప్పక నమోదు చేసుకోవాలని ఎఒ తెలిపారు. ఆధార్‌కు అనుసంధానం చేసిన మొబైల్ నెంబర్ తో గ్రామ వ్యవసాయ సహాయకులని కలిసి గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు.

'పది' విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని పులమితి పంచాయతీ సడ్లపల్లి గ్రామానికి చెందిన పదవతరగతి విద్యార్థి బాబు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, విద్యార్థి బంధువులు తెలిపిన వివరాలు.. సడ్లపల్లి గ్రామానికి చెందిన అంజినమ్మ, అంజినప్ప కుమారుడు బాబు పులమితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయంతో ఊరి బయట కి వెళ్లి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేసాడు. గమనించిన స్థానికులు 108వాహనం ద్వారా హిందూపురం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-హిందూపురం

పిల్లల ప్రవర్తన పై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హిందూపురం ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య సూచించారు. కేవలం విద్యాసంస్థలకు పంపి చేతులు దులుపుపోకుండా ఎప్పటికప్పుడు వారి నడవడికపై తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. గురువారం పరిగి మండల పరిధిలోని ధనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో లైంగిక వేధింపులు, బాల్య వివాహాలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. తహశీల్దార్ హసీనా సుల్తానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయమూర్తి రమణయ్య మాట్లాడుత పిల్లలు మంచి కంటే చెడు విషయాలకే ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు మంచి, చెడు స్పర్శలపై తల్లులు ప్రత్యేక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, ఎఎస్ఐ వెంకటేశులు, న్యాయవాదులు సుదర్శన్, రవిచంద్ర, మురళి, ఈశ్వరప్ప, ఎపిఎం రామేశ్వర్ రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పరిధిలో అన్ని వార్డుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఇ. రమేష్ కుమార్ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుతో కలసి 34వ వార్డు మేళాపురం పరదిలో ఉన్నా ముబారక్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. డ్రయినేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని చైర్మన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మోహన్, కౌన్సిలర్ నాగమణి, టిడిపి నాయకులు అమీన్, సయ్యద్ నజీర్, మక్బూల్, నూర్, జావీద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి....

బిసి కార్పొరేషన్ ద్వారా హిందూ పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచితంగా టైలరింగ్ పై శిక్షణ ఇస్తున్నామని ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివద్ధి సాధించాలని మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పై మహిళలకు అవగాహన సదస్సును మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా చౌడప్ప

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి న్యాయస్థానం ఆవరణములో గురువారం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కమిటీ సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది శాలిమియా వ్యవహరించారు. అధ్యక్షుల స్థానానికి కే చౌడప్ప లింగాల లోకేశ్వర్ రెడ్డి పోటీపడ్డారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా చౌడప్పకు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రమేష్ నాయుడు, కార్యదర్శులుగా జి వెంకటరామిరెడ్డి, సురేంద్ర, సహాయ కార్యదర్శులుగా శివశంకర్, గ్రంథాలయ జ్ఞానవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా రాఘవేంద్ర గుప్త ఎన్నికయ్యారు.

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల 300 మంది రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు శీలా నాగేంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా శీలా నాగేంద్ర మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ తరపున 2008 సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి దాతలుగా మామిళ్ళ ప్రసాద్, జయచంద్ర రెడ్డి, గూండా నాగరాజు వ్యవహరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మాజీ అధ్యక్షులు వైకే. శ్రీనివాసులు, కోటేశ్వరరావు, సభ్యులు సత్రశాల మల్లికార్జున, కేతా లోకేష్, గుండా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - తనకల్లు

స్థానిక కెజిబివి విద్యార్థినులకు నిర్వహించిన టీబీ వ్యాధిపై అవగాహన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు అందజేశారు. కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ధర్మరాజు, ఎస్ఓ హామీదాబీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సోంపాల్యం నాగభూషణ చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్వైజర్ అక్కమ్మ, హెల్త్ సూపర్వైజర్ సావిత్రమ్మ, ఆశా వర్కర్లు రామలక్ష్మమ్మ, మంజుల, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని వీరాపురం గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్ మాట్లాడుతూ రీ సర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కోదండపాణి, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

తలుపుల మండలంలోని అంగన్వాడీలకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం కదిరి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప, ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ ఇచ్చారు. మూడు రోజు పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడం మేధాశక్తి పెంపొందించడం లాంటి వటి గురించి అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అలివేలమ్మ ,మమత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని పిఆర్టి స్ట్రీట్ షాదీ మహల్లో హజ్రత్ టిప్పు సుల్తాన్ టీం ధర్మవరం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ముస్లిం మైనార్టీ నిరుపేదల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశార. రంజాన్ సందర్భంగా దాదాపు 200 మందికి నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హజరత్ టిప్పు సుల్తాన్ రహంతుల్లా ఆలై ధర్మవరం టీం సభ్యులతోపాటు ధర్మవరం టౌన్ ముస్లిం మైనారిటీ పెద్దలు, మత గురువులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
I.P. No:6/2023

Between:
కటికల ఇస్మాయిల్ S/o పి.హైదరవలి డోర్ నెం.1-74, మహమ్మదబాద్ గ్రామము, అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్

And

నారాయణ స్వామి and others ...రెస్పాండెంట్స్

R1 to 7, R11, R16, R17 and R24 లకు నోటీసు

పై పిటీషన్లో పిటిషనర్ అయిన కటికల ఇస్మాయిల్ I.P. దాఖలు చేసుకున్నాడు. సదరు పిటిషన్లో రెస్పాండెంట్ అయిన R1 నారాయణ స్వామి S/o రామక్రిష్ణప్ప సంకేపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R2 అయిన నారాయణ స్వామి S/o గుర్రప్ప, సంకేపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R3 అయిన శ్రీనాథ్ S/o తిమ్మప్ప, సంకేపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R4 అయిన కన్దాయల సుధాకర్ S/o బాల పుల్లప్ప, డోర్ నెం.1-142, సంకేపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R5 అయిన రవి S/o బాబయ్య, సంకేపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R6 అయిన రామచంద్రా S/o గంగప్ప, చెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.మరియు R7 అయిన నాగరాజు S/o మల్లన్న, ఓలిమి చెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.మరియు R11 అయిన రామకృష్ణ S/o నారాయణ, సంకేపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R16 అయిన వెంకటరమణ S/o బిల్లి రామప్ప, యాకాలచెరువుపల్లి, నల్లమాడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.మరియు R17 అయిన రెడ్డెప్ప దొన్నికోట Main Road, నల్లమాడ గ్రామము, నల్లమాడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. మరియు R24 అయిన శ్రీరాములు నాయక్ S/o దేవల నాయక్, కొట్టువారుపల్లి, అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అయిన మీ అందరికి తెలియజేయడం ఏమనగా పై I.P. పిటీషన్లో మీ హాజరు నిమిత్తం పై కోర్టువారు 02-04-2025వ తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో వాయిదా వున్నది. సదరు తేది నాడు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను.లేనిచో ఘనమైన కోర్టువారు పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 02-04-2025
స్థలం : కదిరి

బి.రామమోహన్ రెడ్డి, B.A., B.L,
పిటీషనర్ న్యాయవాది, కదిరి,
శ్రీ సత్యసాయి జిల్లా.

అధికారం శాశ్వతం కాదు : వైసిపి

ప్రజాశక్తి - రొద్దం

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీపీ ఎన్నిక కార్యక్రమాన్ని పరిశీలించడానికి వచ్చిన ఆమె ఎంపీపీ, నల్లూరు ఎంపిటిసి నాగరత్నమ్మతో కలసి విలేకరులతో మాట్లాడారు.కదిరి, రాప్తాడు తదితర చోట్ల కూటమి నాయకులు వైసిపి ఎంపీటీసీలపై ఒత్తిడులు తెచ్చి కిడ్నాపులు చేసి ప్రలోభాలు గురి చేశారన్నారు. తమ ప్రభుత్వంలో ఇలా అనుకుంటే తాడిపత్రిలో మున్సిపల్ చైర్మన్ వైసీపీకి దక్కేదని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రలోభాలు చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే వైసిపి ప్రభుత్వం అధికారం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, సి.నారాయణరెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, చిన్నమంతురు సోమిరెడ్డి, తిమ్మారెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

వస్త్రదుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికల కొలతల శాఖ ఇన్స్పెక్టర్ శివశంకర్

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పలు దుకాణాలను తూనికలు కొలతల అధికారులు గురువారం తనిఖీ చేశారు. వ్యాపారులు నిర్ణయించిందే ధర అనే శీర్షికను ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు తూనికల కొలతల శాఖ ఇన్స్ పెక్టర్ శివశంకర్ గురువారం ముక్కడిపేటలో పలు దుకాణాలను తనిఖీ చేశారు.. నిబంధనలు అతిక్రమించిన రెండు దుకాణాలపై కేసులను నమోదు చేశ్మారు. ఒక దుకాణంలో రెండు చిన్నారుల డ్రెస్సులకు రెండు పాకెట్స్, మరో దుకాణంలో మూడు పాకెట్స్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల కొలతల శాఖకు లోబడి వ్యాపారులు వ్యాపారాలు చేయాలన్నారు. నిబంధనలను ఎవరు అతిక్రమించిన వారిపై కేసులను నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీలను మరింత విస్తతం చేస్తామన్నారు.

వేధింపుల నుంచి పిల్లలను రక్షిద్దాం : ఆర్డీవో

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

ప్రజాశక్తి-పెనుకొండ

పిల్లలపై జరిగే వేధింపులను గుర్తించి రక్షించడం అందరి బాధ్యత అని ఆర్డీవో ఆనంద్ కుమార్ అన్నారు. గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ,మిషన్ వాత్సల్య/డిసిపియు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని భువనవిజయం సమావేశ భవనంలో బాల్య వివాహాలు నిలుపుదల, పిల్లలపై జరిగే అఘాయిత్యాలు, వేధింపులు, బాలల న్యాయ చట్టం అంశాలపై మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. ఇక్కడ బాల్య వివాహం నిలుపుదల చేస్తే కర్నాటక రాష్ట్రానికి వెళ్లి పెళ్లిళ్లు చేసుకుంటున్నారని అన్నారు. ఆడ పిల్లలలో ఆత్మ విశ్వాసం పెంపొందిస్తే బాల్య వివాహాలు తగ్గుదల పట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. సిడిపివోలు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడానికి మొదలు పెట్టినప్పుడు ముందస్తుగా తెలుసుకుని వారితో మాట్లాడితే వివాహం నిలిపి వేయడానికి అవకాశం ఉంటుందన్నారు. 2 రోజులు ముందుగా ఎవరి ద్వారానో వివాహం అని తెలిసుకుని అప్పుడు వివాహాన్ని ఆపడానికి వెళితే అది సాధ్యం కాదన్నారు. చట్టాన్ని అర్థం చేసుకుని చట్టం పరిధిలో పని చేస్తే బాల్య వివాహాలు జరగకుండా చూడవచ్చు అని వివరించారు. డిసిపిఒ మహేష్ మాట్లాడుతూ పెద్దల ప్రవర్తనని బట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు నాగమల్లేశ్వరి, శాంతలక్ష్మి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్లు నాగలక్ష్మి, మురళీధర్, శిశుగృహ మేనేజర్ సునీత, సోసియల్ వర్కర్లు వనజాక్షి, ఆనంద్, లక్ష్మీప్రసన్న మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

బహిరంగ వేలంలో పురపాలికకు భారీ ఆదాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో వివిధ మార్కెట్లలో సుంకం వసూలు చేయడానికి నిర్వహించిన బహిరంగ వేలంలో పురపాలికకు భారీ ఆదాయం లభించింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా రూ 24. 67 లక్షలు ఆదాయం లభించింది. గురువారం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు సమక్షంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పురపాలక సంఘ దినసరి కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్ ల పై అమ్ముకొను వస్తువులపై సుంకం వసూలు చేయడానికి, అదేవిధంగా పెద్ద పశువులు వాటి తోళ్ల మార్కెట్ లో సుంకం వసూలు చేయడానికి బహిరంగ వేలం నిర్వహించారు. నాలుగు మార్కెట్లకు సంబంధించి పురపాలక సంఘం వారు రూ. 69.9 లక్షలతో బహిరంగ వేలాన్ని ప్రారంభించగా రూ. 94.57 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. ఈ బహిరంగ వేలంలో మున్సిపల్ మేనేజర్ సుధాకర్, రెవెన్యూ అధికారిణి విజయభారతి, రెవిన్యూ ఇన్స్ పెక్టర్లు రాము, రామాంజనేయులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఇన్విజిలేటర్ల నియామకంలో నిబంధనలను పాటించని కదిరి మండల విద్యాశాఖ అధికారిపై తక్షణం శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్ వలీ, సుబ్బారెడ్డి, కదిరి జోన్ యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారి వాస్తవాన్ని పక్కదారి పట్టించేందుకు కొంతమంది ఉపాధ్యాయులను ప్రేరేపించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా శాఖ పక్షాన జిల్లా విద్యాశాఖ అధికారికి బుధవారం ఫిర్యాదు చేశామన్నారు. డిఇఒ వెంటనే స్పందించి విచారణ నిర్వహించి ఎంఇఒపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని అవసరమైతే ఉద్యమానికి కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ గడువును పొడిగించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు ఆలకుంట మారుతీ, ఎస్ఎచ్, బాషా, రమణ ఆధ్వర్యంలో ఆర్డిఒ మహేష్కి గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బియ్యం కార్డులకు సంబంధించి ఈకేవైసీ గడువును ఈ నెల 30 తారీఖున చివరి తేదీగా ప్రకటించడం వలన అనేకమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, పిల్లలకు ఈకేవైసీ పని చేయకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నారని, దూర ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన తేదీలోపు వారు రావడానికి అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని కోరారు. ఈకేవైసీ తీసుకోవడానికి ప్రతి స్టోర్ డీలర్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లాలని ఆ విధంగా లబ్ధిదారుల అందరికి ఈ కేవైసీ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. హైదర్ వలి, గుంపు హరి, ఎల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ చేయించుకోవడానికి మరో నెల రోజులు గడువును పొడిగించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కదిరప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులు సకాలంలో ఈకేవైసీ చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్డుదారుల సంక్షేమం దష్ట్యా మరో నెల రోజులపాటు గడువును పెంచి రేషన్ కార్డుదారులందరూ ఈ కేవైసీ చేయించుకునే అవకాశం కల్పించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, మనోహర, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: రేషన్ కార్డు లబ్ధిదారులకు అమలు చేస్తున్న ఈకేవైసీ గడువును పొడగించాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక తహశీల్దార్ రెడ్డి శేఖర్కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు చాలామంది ఈ కేవైసీ చేయించుకోవటానికి వీలుపడటం లేదన్నారు. ఈ నేపథ్యంలో గడువును పొడగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి అంజన్ బాబు, సిపిఐ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, ఎల్వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాటతో రూ. 36.68 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక పంచాయతీ కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలం పాటతో పంచాయతీకి రూ. 36.68 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవోఆర్డీ ఆనంద్ కుమార్ తెలిపారు. బస్టాండ్లో వాహనాలు పార్కింగ్, వారపు సంత నిర్వహణకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ లోని వాహనాల పార్కింగ్ నిర్వహణకు సంవత్సరం కాలానికి రూ.34. 56 లక్షలకు గోవింద్ అనే గుత్తేదారుడు దక్కించుకొన్నాడు. అదేవిదంగా వారపు సంతలో రుసుము వసూలు చేయడానికి రూ.2.12 లక్షలకు నాయాజ్ అనే గుత్తేదారుడు దక్కించు కొన్నాడు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి ఆదినారాయణ, ఎస్ఐ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి సాయి ప్రసాద్, గుత్తేదారులు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండ పంచాయతీ కార్యాలయంలో గురువారం పశువుల సంత,కూరగాయల సంత,బస్టాండ్ దినసరి సంతకు సర్పంచి కరుణాకర్ అధ్యక్షతన వేలం పాటను నిర్వహిచారు. పశువుల సంత వేలం మందలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తికి 67,10,000 రూపాయలకు అదే విధంగా కూరగాయల సంత 2,80,000 రూపాయలకు గుడిబండకు చెందిన పురుషోత్తం అనే వ్యక్తి దక్కించుకున్నారు. బస్టాండ్ దినసరి సంతకు 2,04,000 రూపాయలకు గుడిబండకు చెందిన నటరాజ్ అనే వ్యక్తికి దక్కించుకున్నారు. మొత్తం 71, 94,000 రూపాయలకు గుడిబండ సంతకు వేలం పాట నిర్వహించినట్లు ఈవోఆర్డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. ఈవేలం పాటలో ఎంపీడీవో గంగాధర్,మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, దుర్గేష్, మంజునాథ్, వేలం పాటదారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్పై అవగాహన

ప్రజాశక్తి-పెనుకొండ

స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ శిక్షణలో భాగంగా శెట్టిపల్లి, రాంపురం యూనిట్స్ లోని గ్రామైక్య సంఘాల లీడర్లు, విఓ అనిమేటర్లలతో ప్రకృతి వ్యవసాయం పై మండల స్థాయి సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అదేవిధంగా ఖరీఫ్ వార్షిక ప్రణాళిక పై వ్యవసాయ శాఖ, వెలుగు, సెరికల్చర్ శాఖల సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ పై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం లో మంచి దిగుబడులు సాధించిన రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చందన, వెలుగు ఎపిఎం రవిచంద్ర రాజు, ప్రభావతి, సాకప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సలహాదారుడికి సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీకి ప్రభుత్వ న్యాయ సలహాదారునిగా ఎంపికైన న్యాయవాది నిరుమామిడి శ్రీనివాసులును జనసేన నాయకులు సన్మానించారు. ఈ మేరకు వారు గురువారం న్యాయవాది స్వగృహంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ కార్యదర్శి రాము, కొత్తచెరువు మండల పార్టీ కన్వీనర్ పూల శివకుమార్, ఉమాపతి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధి ఎనుములపల్లిలోని ఎబినేజర్ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అందరి అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జోసెఫ్, సెక్రటరీ టీ. జోసెఫ్, ట్రెజరర్ సురేష్ డేవిడ్, జిల్లా అసోసియేషన్ సభ్యులు విశ్వా, డానియేల్, సోలోమోను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో విచారణ జరిపించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్, హిందూపూర్ పాస్టర్ ఫెలోషిష్ ప్రెసిడెంట్లు రెవ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ కూడలిలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు డాక్టర్ ఎన్ డేవిడ్, రెవ, ఎస్ సూర్యప్రకాష్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, డాక్టర్. స్టీఫెన్ రాజ్, ఐజక్ పాల్, మనోజ్ మింటూ, డేనియల్, క్రైస్తవ నాయకులు, సంఘాల పెద్దలు, పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీ కొన్న కారు

నలుగురు ఉపాధ్యాయులకు గాయాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

అనంతపురం కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడగా, మరో ఐదుగురు ఉపాధ్యాయులు స్వల్పగాయాలతో బయటపడ్డారు క్షతగాత్రులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నల్లబోయనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తమ విధులను ముగించుకుని అనంతపురానికి తిరుగు ప్రయాణం అయ్యారు. అనంతపురానికి చెందిన ఒక ప్రవేట్ సుప్రా ఆటో ప్రతి రోజూ పాఠశాల వద్దకు వచ్చి వదిలేసి, తిరిగి వెళ్లేటప్పుడు ఎక్కించుకునేలా ఉపాధ్యాయులు మాట్లాడుకున్నారు. యధావిదిగా గురువారం పాఠశాల వద్దకు వచ్చిన ఆటోలో ఉపాధ్యాయులు బి. ఆనందరెడ్డి, రామచంద్ర, మహబూబ్ బాషా, చాంద్బాషా, విల్లే ఉమాదేవి, పి.ఉమాదేవి, విశాల, అనూరాధ, రికార్డు అసిస్టెంట్ పార్వతమ్మ అనంతపురానికి బయలు దేరారు. వారి వస్తున్న ఆటో చిత్రావతి నది బ్రిడ్జి దాటిన తర్వాత ఉప్పరపల్లి క్రాస్ వద్దకు రాగానే ముదిగుప్ప వైపు నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఆటోను వెనుక వైపు నుంచి ఢీ కొంది. దీంతో అదుపుతప్పిన ఆటో డివైడర్ను ఢీ కొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆనంద్రెడ్డి, బిల్లే ఉమాదేవి, పి.ఉమాదేవి, పార్వతమ్మకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఉపాధ్యాయులకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స ఆనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్కు తరలించారు ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాద్యాయులు తీవ్రంగా గాయపడ్డారన్న సమాచారం అందుకున్న సహచర ఉపాధ్యాయులు, ఎంఇఒలు, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఆర్డీటీ ఆసుపత్రి వద్దకు తరలివచ్చారు. ఎంఇఒలు చాముండేశ్వరి, సుధాకర్, నల్లబోయనపల్లి హెచ్ఎం ప్రహోల్లాదనాయుడు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ మాజీ చైర్మన్ హరినాథరెడ్డి. నాగేశ్వరరెడ్డి, భరత్కుమార్రెడ్డి, ఓబిరెడ్డి తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు.

ఫోన్లో పరామర్శించిన డిఇఒ : నల్లబోయనపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయాన్ని ఎంఇఒల ద్వారా తెలుసుకున్న డిఇఒ కిష్టప్ప క్షతగాత్రులతో ఫోన్లో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఎంఇఒలను ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తా... డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో రెండుట్రాక్టర్లు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. గురువారం ఉదయం నల్లూరు గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర (18) నల్లూరు పెన్నా నది నుంచి ఇసుక ట్రాక్టర్ తో పెనుగొండకు వెళ్లి తిరిగి వస్తుండగా సోమందేపల్లి మండలం మేకల పల్లి చోలెమర్రి క్రాస్ మధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ మధ్యలో ఉన్న పెద్ద టైర్ల కిందకు చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు.. అదేవిధంగా మధ్యాహ్నం పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో ఎల్జిబి నగర్ సమీపంలో మట్టి తోలుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఈ రెండు ట్రాక్టర్లు ప్రమాదానికి గురికావటానికి అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోనిసుందరయ్య నగర్ కు చెందిన ముద్దుకృష్ణ అనే వ్యక్తి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన ఇంటిలో ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వచ్చి చికిత్స చేయించారు. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముద్దుకృష్ణ ఆత్మహత్య ప్రయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గొల్లపల్లి వద్ద మరో వ్యక్తి...

ధర్మవరంలోని రాంనగర్కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది గురువారం గొల్లపల్లి వంక వద్ద సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి చంద్రశేఖర్ ను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి చికిత్స చేయించినారు. అనంతరం చంద్రశేఖర్ ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. చంద్రశేఖర్ కూలి పని చేస్తాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి - గోరంట్ల

స్థానిక మండల కాంప్లెక్స్ సమీపాన ఉన్న పౌరసరఫరాల గిడ్డంగిని జిల్లా సివిల్ సప్లై అధికారి వంశీకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన గోడౌన్ లో ఉన్న స్టాకును పరిశీలించారు. ఈసందర్భంగా స్టోర్ డీలర్లు తమ సమస్యలను డిఎస్ఒకు విన్నవించారు. తమకు ప్రతి నెల స్టాకు తక్కువగా ఇస్తున్నారని దీంతో 100శాతం కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయలేకపోతున్నామని చెప్పారు. లబ్ధిదారులకు సరిపడా బియ్యం సరఫరా చేయకపోతే ఈనెల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయమని డీలర్లు డిఎస్ఒతో అన్నారు. దీంతో డిఎస్ఒ మాట్లాడుతూ కార్డుదారులకు ఇచ్చిన తర్వాత స్టోర్ డీలర్ వద్ద 10 శాతం నిలువ ఉండడం వలన వాటిని మినహాయించి పంపిణీ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో స్టాక్ పాయింట్ అధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల కమీషన్ పెంచండి

ప్రజాశక్తి - పావగడ

రేషన్ దుకాణాల యజమానుల కమీషన్ పెంచాలని రేషన్ సరఫరా దారుల సంఘం అధ్యక్షులు టి. క్రిష్టప్ప కోరారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని విశ్రాంతి భవనంలో తాలూకలోని రేషన్ దుకాణాల యాజమానులతో కలసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 వేల రేషన్ దుకాణాలు ఉన్నాయని ఎలాంటి సమస్యలు లేకుండా దుకాణల యజమానులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం రేషన్ కార్డులో వున్న ప్రతి సభ్యుడికి 15 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ దుకాణం యజమానులు వినియోగధారులకు అందాల్సిన ఆహార ధాన్యాలు సక్రమంగా ఇవ్వాలని, మోసం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రభుత్వం పంచదార, కందిపప్పు, ఉప్పు, వంటనూనె పంపిణీ చేస్తే ప్రభుత్వానికి డబ్బులు చెల్లిస్తామన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యావసరసరుకుల కోసం ఒక చోట నుండి మరొక చోటికి వెళ్లకుండా చూడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా దుకాణాల సంఘం అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు ప్రసాద్, సుబ్బయ్య, గోపాల్, రామన్న, శివమూర్తి, హనుమంతరావు, రామకృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

శివప్ప మృతి పార్టీకి తీరనిలోటు : టిడిపి

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని కడుపులయ్యపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శివప్ప మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి గురువారం మృతుడి ఇంటికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. శివప్ప మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయన టిడిపికి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు రవి,వ ర్మార్తి, జమనడుకు రంగా, ఫీల్డ్ అసిస్టెంట్లు తిమ్మారెడ్డి, రమేష్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.